# ఆకాశం అంచుల్లోకి

బహరీన్ నుండి వచ్చిన "గల్ఫ్ ఎయిర్ బస్ సహార్ విమానాశ్రయంలో ఆగింది. ఇతర ప్రయాణికులతోపాటు తనూ దిగాడు మధుకర్.

మూడు సంవత్సరాల తరవాత తన మాతృదేశంలో అడుగుపెట్టిన అతనికి ఎంతో ఆనందంగా ఉంది. ఆప్తులను, బంధుమిత్రులను త్వరగా కలుసుకోబోతున్నాననే ఊహే అతనిని పులకరింపజేస్తుంది.

తను చాలా వస్తువులను తీసుకురావడంవల్ల కస్టమ్స్ క్లియరెన్స్‌లో కాస్త జాప్యం జరిగింది. చివరకు కొన్ని డాలర్లు వదిలించుకుని ఆఫీసర్లతో సంధి చేసుకోవాల్సి వచ్చింది. అలా రెండు గంటల తరవాత రెండు పెద్ద సూట్‌కేసులు, రెండు పెద్ద బాక్సులు ట్రాలీపై తోసుకుంటూ బయటకు వచ్చాడతను.

"నమస్కారం సార్!"

బొంబాయిలో తెలుగు పిలుపు! ఇక్కడ తనకు నమస్కారం పెట్టేవారెవరా అని చూస్తే, ఒక అపరిచితుడు!

"నమస్కారం. క్షమించండి. నేను మిమ్మల్ని గుర్తు పట్టలేదు."

"మనకు పరిచయం లేదు కాని మన తెలుగోల్ల లెక్క ఉన్నరని పల్కరించిన. నా పేరు రాజేశ్. నేను 'ఆల్ ఇన్ వన్ ట్రావెల్స్' నుంచి అచ్చిన (వచ్చాను). ఇదిగోండి మా కార్డ్. మీకు కావల్సిన వ్యవస్థలన్ని చేస్తం మేము."

"అన్ని వ్యవస్థలంటే? కాస్త అర్థం అయేటట్టు చెప్పండి" అతనిచ్చిన కార్డు పరిశీలిస్తూ అడిగాడు మధుకర్.

"అంటే ఊడ దిగిన కాడ్నుంచి మన దేశం పోయే బస్సన్న. గాడన్న(రైలు) ఎక్కేదాక అంత ఇంతజాము (ఏర్పాట్లు) జేత్తం. మీరు మల్ల తిరిగి పోయేతందుకు విజ తెచ్చుకుంటే మీ విమానం టిక్కెటుగూడ ఓ.కే. సేపిత్తం" రాజేశ్ విడమర్చాడు.

ఇలాంటివి ఎన్నడూ వినలేదే? అనుదినం హత్యలూ, మోసాలూ, గ్యాంగ్‌వార్లూ, అప్పుడప్పుడూ బాంబు పేలుళ్ళూ జరిగే బొంబాయిలో ఇదో కొత్త తరహా మోసం కాదు కదా? మూడు సంవత్సరాల తన కష్టార్జితం, డాలర్లు, వస్తువుల రూపంలో తెచ్చాడు. అవి అన్నీ వీళ్ళు దోచుకునే ప్లాను కాదు కదా? మధుకర్ ఆలోచనలో పడ్డాడు.

రాజేశ్‌ను అనుమానంగా చూడసాగాడు.

"అనుమానం ఏం జేతున్నరు సార్? మేమేమన్న పపాయించెటోల్ల (మోసం చేసే వారిలాగా) మనుకుంటున్నారా? అదేం లేదు సార్, ఇక్కడోల్లు మనోల్లను మోసం జేత్తున్నరని మేం ఈ దంద (వ్యాపారం) శురు జేసినం (ప్రారంభించాం). మీలెక్క ఇంక నలుగురు మస్కట్ నుంచి దుబాయి నుంచి వచ్చినోల్లున్నరు. గాడ మన క్వాలిస్ జీపున్నది. మీకు మామీద నమ్మకముంటే ఎక్కండ్రి. ఏం జబర్‌దస్తీ (బలవంతం) లేదు."

"సరే చూద్దాం పద" అని మధుకర్ అతని వెంట బయలుదేరాడు.

పార్కింగ్‌లో ఉన్న క్వాలిస్ టాపుపై నాలుగు పెద్ద సూట్‌కేసులున్నాయి. నలుగురు తనలాంటి పాసింజర్లు దాని పక్క నించున్నారు. ఆ వాతావరణం చూడగానే మధుకర్‌కి నమ్మకం కలిగింది. సరే వెళ్లాం. ఇంతకీ మీ ఛార్జీలేమిటి?

"మన తెలుగోల్ల దగ్గెర ఎక్కువ దీసుకుంటమా సార్? మీరు ఎక్కండ్రి. పోంగ పోంగ (పోతూ) మాట్లాడుకుందాం."

జీపు వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే మీదుగా వర్లి వైపు దూసుకుపోతోంది. సహప్రయాణికులు తమను తాము పరిచయం చేసుకుంటున్నారు.

"నా పేరు ఎర్రన్న. మాది సిరిసిల్ల. మస్కట్‌ల ఆస్పిటల్ల పనిజేత్తున్న."

"నేను ముత్తయ్యను. దుబాయిల బేల్దారు పనిజేత్తున్న. మాది మెట్‌పల్లి దగ్గర ఇబ్రహీంపట్నం."

"మాది కామారెడ్డి. నేను షార్జాల పెట్రోల్ పంపుల పనిజేత్త. నా పేరు నర్సిములు."

"నేను సౌది నుంచి అస్తున్న. నా పేరు సీతారాం. మాది జక్రన్ పెల్లి. నిజాంబాద్ జిల్లా."

"నేను బహరిన్‌లో కంప్యూటరు ఆపరేటరుగా ఉన్నాను. మాది ఆర్మూరు దగ్గర పెర్కిట్. నన్ను మధుకర్ అంటారు."

ఇక డ్రైవర్ చెప్పసాగాడు.

"మీకు సెప్పితి గదా నా పేరు రాజేశ్. ఈ ట్రావెల్ కంపని మా చిన్నాన్నది. ఇంటర్ జేసి, ఊర్లె ఉత్తగ తిరుగుతున్న నన్ను మా చిన్నాన్న ముంబయి పిలిపించి డ్రైవర్ పని నేర్పిచ్చిండు. గీ ట్రావెల్ కంపెని నేనే జూసుకుంటున్న. మాది చౌట్‌పల్లి. కమ్మరిపెల్లి మండలం. నిజాంబాద్ జిల్లా."

"ఇప్పుడు మనం ఎక్కడి కెళ్తున్నాం? భోజనం వసతి అన్ని సౌకర్యాలుంటాయా? వాటికి మీ ఛార్జి లేమిటి?" మధుకర్ అడిగాడు.

"మా ఆఫీసు వర్లీల ఉన్నది. ఆడ సామాను పెట్టటానికి ఒక రూం. పండుకునెదనికి (పడుకోవడానికి) నాల్గు రూములున్నయ్."

"మా వస్తువులు సురక్షితంగా ఉంటాయా?" మధుకర్‌లో అదే అనుమానం.

"మీ సామానుకేం నుక్‌సాన్(నష్టం) కాదు సార్. మీరెట్ల కడుపు తిప్పలుకు 'అవుటాఫ్' పోయిన్రో, అట్లనే, మేం కూడ పొట్ట సేత పట్టుకొని ముంబయి అచ్చినం. ఏదో మనక్కడోల్లకు సేవ సేయలని కాని ఎవరికి మోసం జేసెటోల్లం కాదు సార్ రాజేశ్.

"మీ ఛార్జీలు సెప్పకపోతిరి" ఎర్రన్న అడిగాడు.

"మనోల్ల దగ్గెర ఎక్క తీసుకోమని జెప్పిన గదా!"

"పొద్దుగల్ల టిఫినుతోని, రెండు పూటల భోజనం, పండనీకి జాగ (పడుకోవడానికి చోటు), సామానుకు అంతా కలిపి రోజుకు రెన్నూరు రూపాలు తీసుకుంటం. ఏర్‌పోర్ట్ నుంచి వర్లికి, మల్ల మీరు దేశం (ఊరు) పోయెతందుకు బస్సన్న, రైలన్న ఎక్కెతందుకు మల్ల మా జీపుల దిగబెడ్తం. దానికి నూరు రూపాలు ఛార్జి. అదే మీరు బయట ఓటల్ల ఉంటే దినమ్ వేయి రూపాలు గూడ సాలయి. అంతేగాక వాళ్ళు ఫసాయించినా దిక్కుండది" రాజేశ్ విడమర్చాడు.

మాటల్లో వర్లీ రానే వచ్చింది.

వర్లి... ఒకప్పుడు బట్టల మిల్లుల రణగొణ ధ్వనులతో చిమ్నీల నుంచి వచ్చే పొగతో, కార్మికుల సందోహంతో కిటకిటలాడే ప్రాంతం.

ఇప్పుడు?

మిల్లు రణగొణ లేదు. అవి మూగపోయాయి. వాటి స్థానంలో ధనవంతులు నివసించే ఆకాశహర్మ్యాలు వెలిశాయి. పెద్ద పెద్ద ఆఫీసు సమూహాలు మెలిచాయి. పూలమ్మిన చోట కట్టెలమ్ముతూ మిల్లు కార్మికులు ఆ ప్రాంతంలోనే బతుకులీడుస్తున్నారు. వర్లి బి.డి.డి.చాల్‌లోని నూటతొమ్మిది నెంబరు చాల్ (బిల్డింగు) పదహారవ నెంబరు గదిలో వారి సామాను సర్దారు. ప్రతి సూట్‌కేస్‌పై చాక్‌పీసుతో నెంబర్లు రాసి ఆ యా నంబర్ల టోకెన్లు ఎవరివి వారికి ఇచ్చారు. ఆ పక్క రూములోనే వారి బస. చిన్న గదిలో కింద ఆరుగురు. పైన అటకపై నలుగురు పడుకునే వసతి కల్పించారు. ఓ మూల బాత్రూం. లెట్రిన్‌లు మాత్రం బయట ఆ అంతస్తులోని ఇరవై గదులకూ కామన్‌గా ఉన్నాయి. చోటుకు యుద్ధమయ్యే ముంబయిలో అంత చవకగా ఆ మాత్రం సౌకర్యం ఫరవాలేదనుకున్నారు 'అవుటాఫ్' నుంచి వచ్చినవారు.

"మీరు స్నానం చేసి తయారుకాండ్రి. గంటయినంక నేవచ్చి మిములను భోజనంకు తీసుకపోత" అని రాజేశ్ నిష్క్రమించాడు.

రాజేశ్ తిరిగి వచ్చేసరికి, మధుకర్ తదితరులు రెడీగా ఉన్నారు. వారిని దగ్గరలోని దుకాణాల సముదాయంలోని "తెలుగు తల్లి భోజనాలయం"కు తీసుకువెళ్లాడు రాజేశ్.

దుకాణాల పేర్లు తెలుగులో రాసి ఉండడం, రోడ్డుపై వచ్చిపోయేవారు తెలుగులో మాట్లాడుకోవడం, ఇదంతా చూసి వారికి తమ ఊరిలో ఉన్న భ్రాంతి కలిగింది.

తెలుగు కట్టు, బొట్టుతో గల్లా పెట్టెముందు సాక్షాత్తూ అన్నపూర్ణమ్మలా కూర్చున్న ఆమెను చూడగానే అప్రయత్నంగా నమస్కారం చేశారు రాజేశ్ వెంట వచ్చినవారు.

"సిన్నవ్వా, వీల్లు ఇయ్యల్ల (ఈరోజు) అవుటాఫ్ కెల్లి అచ్చిండ్రు. అందరు మన నిజాంబాద్, కరీంనగర్ అక్కడోల్లే" అని వారిని ఆమెకు పరిచయం చేసి, ఆమె తన పిన్ని భూమ గంగవ్వ అని చెప్పాడు రాజేశ్. ప్రతి నమస్కారం చేసి వారిని కుర్చీల్లో కూర్చోమని చెప్పి, వంటగదిలోకి వెళ్లింది భూమ గంగవ్వ. అరటి ఆకులపై ఆమె స్వయంగా వడ్డించసాగింది.

అన్నీ తమకు చిరపరిచితమైన వంటకాలు! ఊళ్ళో తమ అమ్మ చేత భోంచేస్తున్న

అనుభూతి! అందరికీ ఆప్యాయంగా కొసరి కొసరి వడ్డిస్తూ తమ వివరాలు చెప్పసాగింది భూమ గంగవ్వ.

"మేం మమ్మయి (ముంబయి) వచ్చి నలుపై ఏండ్లాయె. మా అయిన గిర్నిల సాంచెలు (మిల్లులో మరమగ్గాలు) నడిపిత్తుండె. నేను బీడీలు సేత్తుంటి. మేమ్దిదరం, మా ముగ్గురు ఆడపిల్లలు, మంచిగనే బతకవట్టినం. పెద్దోల్లిద్దరిని కాలేజిల శరీక్ జేసినం. గంతలోనే మా బతుకుల పిడుగువడె. గడోడో దత్తా సామంత్ పున్యాన గిర్నిల సంపు ఆయె. గా సంపు (సమ్మె) ఇరువై నెలలయినంక అయిపాయెగని. అప్పటికి గిర్నీలు పూర్తిగా బందు అయె. అదువరిదాక మిల్లులు చాలయితయి (మొదలయితయి) అని ఆశతోని కలో గంజో తిని బతుకుతన్న. మాకు సేతికి సిప్ప అచ్చినట్టాయె. ఇగ ఏం గతి? దేశం తిరిగి ఎల్లిపోదమంటె, అక్కడికి పోయి ఏం జేయాలె? ఆడ బతుకుదోవ లేకనే ఈడికస్తిమి. మల్ల ఆడికేం మొకం పెట్టుకొని పోతం? కలో గంజో ఈడనే తాగుదం అని గీ పొట్టకు పెట్టుడు (పూటకూళ్ళు) మొదలుపెట్టిన. ఇరవై మందితోని సురు (మొదలు) ఐన. పని ఇప్పుడు రెన్నూరుకు పెరిగింది. రోజు తినెటోల్లు నెలకింతని ఇస్తరు. అప్పుడప్పుడు అచ్చేటోల్లు పూటకింతని ఇస్తరు. మాకు ఆధారం దొరికిందిగాక, మాతోని ఇంక పదిమంది వంటగాల్లకు బతుకుదోవ దొరికింది. ఆ ఎంకటేసుని దయతోని, మీ అసుంటోల్లకు మన తెలుగు వంటలు తినిపించే భాగ్యం కలిగింది. మా ఆయిన అల్లారు (చింత) తీరింది. ఇల్లు సుకంగ గడుస్తున్నది. అగో మాటల్ల మా ఆయిన రానె అచ్చె" అని శివారం వైపు తిరిగి "నీకు నిండ నూరేండ్లు. నీ గురించే సెపుతున్న" అని భూమ గంగవ్వ అక్కడ భోంచేస్తున్న వారి గురించి చెప్పింది. శివరాం నమస్కారం చేశాడు. భోజనం చేసినవారిని తిరిగి రూంకు తీసుకువచ్చారు. శివరాం, రాజేశ్‌లు.

మాటల్లో, ముత్తయ్యకు, శివరాంకు దూరపు బంధుత్వం తేలింది. అది వారినింకా దగ్గరకు చేర్చింది.

"అవ్ మామా, గిర్నిల ముకద్దం (సూపర్‌వైజర్) పనిజేసినవట. గీ దంద (వ్యాపారం) ఎప్పుడు పెట్టినవే?" ముత్తయ్య అడిగాడు.

'ఏమీ అత్తమ్మ సెప్పిండచ్చు గదా, మా గిర్నిల సంపు (సమ్మె), అటెనుక అవి బందయిన సంగతి? అప్పుడు నేను గూడా మస్కట్ పోదమనుకున్నా. ఇక్కడ ఏజెంటుకు వేలకు వేలు ఇచ్చి, విజ రాక నెలల కమాన ఇక్కడ నెరిపడెటోల్లను జూసి అది పనిగాదనిపించింది. గప్పుడే మీ అత్తమ్మ ఒక కొటీడు (గది) కొనిపించింది. గిర్నిల రాజినం పెట్టినంక అచ్చిన పైసలతోని, అది మస్కటోల్లకు పండే కొటీడు (పడుకునే గది) జేసి ఆల్లకు పొట్టకు పెట్టుడు (పూటకూళ్ళు) చాలు (మొదలు) సేసినం. గొన్ని పైసలు జమ గాంగనె సోపతిగాల్లు జీపు కొనుమన్నరు. అట్ల పాత జీపు కొని మా రాజేశును దేశం (ఊరు) నుంచి పిలిపించి, డ్రైవరు పని నేర్పిచ్చిన. మా రాజేశచ్చినంక మా పని పెరిగింది. ఆదాయం పెరిగింది. ఇంక రెండు రూములు కొన్నం. ఇప్పుడు రైలు, బస్సు, విమానం టిక్కట్లు బుక్ చేసేటి ట్రావెల్ ఏజెన్సీ పెట్టినం. మా రాజేశు ఇంక ఏమేమో సేద్దమంటడు" శివరాం ఆగాడు.

"ఇది చాలా బాగుంది. మేము బయటి దేశాలకు పోయినా సంపాదించినంత ఆస్తి,

మీరు ఇక్కడనే సంపాదిస్తున్నారు. అవును రాజేశ్, నీ భవిష్యత్తు ప్లాన్లు ఏమిటి?" మధుకర్ అడిగాడు.

"ఊర్లో ఇంటర్ దాక సదివిన. ఇక్కడికొచ్చి డ్రైవింగ్ పని నేర్సుకున్న. ఇప్పుడు ప్రైవేటుగా బీ.కాం. సదుతున్న. అవుటాఫ్ పంపుతమని మోసం జేస్తున్న ఏజంట్ల నుంచి మనోల్లను కాపాడుదమని ఆలోచన. లేబర్ డిపార్ట్‌మెంట్ నుంచి లైసెన్సు దీసుకొని, అవుటాఫ్ పంపే ఏజన్సీ తియ్యాల్నఉన్నది. మా సుట్టాలు బయటి దేశాలల్ల ఉన్నారు. ఆల్ల సాయంతోటి మంచి కంపెనీల విజలు దెచ్చి, ఏదో కొంత లాభం జూసుకొని నాయంగా (న్యాయంగా) ఇమానంగా (నిజాయితీతో) పనిసేసి, మన తెలుగోల్లకు సేవ జేయలని ఉన్నది. అంతా ఆ ఎంకటేసుని దయ" రాజేశ్ ముగించాడు.

అవరోధాలను అవకాశాలుగా మార్చుకున్న చదువంతగా రాని శివరాం, కాస్తో కూస్తో చదువుకున్న రాజేశ్, అస్సలు చదువేరాని భూమ గంగవ్వ, సేవా భావంతో, మనవాళ్ళకు సహాయపడాలనే తపనతో, చిత్తశుద్ధితో చేస్తున్న పని మధుకర్‌ను ఆకట్టుకుంది.

ఉద్యోగాలపై గల్ఫ్ దేశాలకు వెళ్ళగోరేవారికీ, బయటినుంచి తిరిగి తమ ఊరు వెళ్ళడానికి వారి ఈ 'సింగిల్‌విండో' పథకం అతనికి బాగా నచ్చింది. గది కిటికీ నుంచి బయటకు చూస్తున్న మధుకర్‌కు శివరాం, భూమ గంగవ్వ, రాజేశ్ ఆకాశం అంచుల్లోకి దూసుకుపోతూ కనిపించారు.